క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు



అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని పర్ష మాధురిని మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. బైపీసీలో 440 మార్కులకు గాను 430 మార్కులు సాధించింది భవిష్యత్‌లో డాక్టర్ అవుతానని అనడంతో సమాజానికి సేవ చేయాలని సూచించారు.

ఆలయంలో అన్నదానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం ఆలయ అర్చకులు సురేశ్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాల ధరించిన భక్తులు నిత్య అన్నదానం, అభిషేకం పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కండెం సురేశ్‌కు ఉగాది నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న కండెం సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ జాతీయస్థాయి ఉగాది స్వర్ణ నంది అవార్డు అందుకున్నారు. వైకే ఫౌండేషన్ 12 ఏళ్ల నుంచి చేస్తున్న రక్తదానంతో పాటు సామాజిక సేవలను గుర్తించి శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వతి పరిషత్ ఆవరణలో నిర్వహించిన జాతీయ స్థాయి ఉగాది స్వర్ణనంది అవార్డు–2024కు గాను సినీ దర్శకుడు రాజ్‌స్వరూప్, జాతీయస్థాయి మానవ హక్కుల చైర్మన్ డాక్టర్ బాబు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఆదర్శ విద్యాలయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో ఉన్న ఆదర్శ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. ఆదర్శలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. కాగా ప్రతీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయి. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీటు పొందిన విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు ఉచితంగా అందించడంతో పాటు దూరప్రాంత విద్యార్థులకు నిర్దేశిత సీట్ల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న చిరుమిల్ల రాకేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన మంథని వెంకటమ్మ ఇటీవల మరణించగా ఆమె కుటుంబీకులు మంథెన నర్సింగ్, రమేశ్, కేదారి, సత్యంను ఆదివారం టీఎస్‌టీఎస్‌సీ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్ తదితరులు పరామర్శించారు. నాయకులు చంద్రమౌళి, శీలంబాబు, ముప్పిడి సమ్మయ్య, చింటు ఉన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం



గోదావరిఖనిటౌన్: రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా చింతల రాజిరెడ్డి, అధ్యక్షుడిగా ఈద జగన్‌మోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంకణాల ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మెంతల దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా చందుపట్ల తిరుపతిరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



ఎలిగేడు: స్వాగతం పలుకుతున్న కార్యదర్శి



ధర్మారం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



రామగుండం: స్వాగతం పలుకుతున్న ఎంపీడీవో



ముత్తారం చేరుకున్న ఎన్నికల సిబ్బంది



కమాన్‌పూర్: పరిశీలిస్తున్న అధికారులు



ఫెర్టిలైజర్‌సిటీ: అభ్యర్థుల వివరాలతో కూడిన గోడ ప్రతి



కొలనూర్: సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



జూలపల్లి: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

జూలపల్లి: ఎంపీ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు అధికారులు. ఆదివారం పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు సామగ్రితో చేరుకున్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బందికి అంగన్వాడీ టీచర్లు స్వాగతం పలికారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్ల సంఖ్య 21,964 మంది ఉండగా, ఇందులో మహిళలు 11,117 మంది కాగా, 10847 మంది పురుష ఓటర్లు ఉన్నారు. వీరు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తాగునీరు, నీడ, సీసీ కెమెరాలు, వృద్ధులకు వీల్‌చైర్ సిద్ధంగా ఉంచారు. ఎన్నికల బందోబస్తుకు పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

ముత్తారం: మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సుమన్ తెలిపారు. మండలంలో 26 పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండలంలోని పారుపల్లి పంచాయతీలోని మానేరు అవతల ఉన్న శాత్రజ్‌పల్లిలో 111 మంది ఓటర్ల కోసం నూతనంగా 278ఎ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయడంతో స్థానిక గిరిజనులు సంబర పడుతున్నారు. మానేరు దాటి ఓటేసే పరిస్థితి తప్పిందని గిరిజనులు పేర్కొంటున్నారు. మండలంలో స్త్రీలు 11,194, పురుషులు11,694 మొత్తం 22,889 ఓటర్లు ఉన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ఎన్నికలకు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామం మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సిబ్బంది చేరుకొని పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

ధర్మారం: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సిబ్బంది సామగ్రితో తరలివెళ్లారు. అధికారులు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 53 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో రజిత తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి దాదాపు 10మంది సిబ్బంది చొప్పున 530 మంది సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. ఇందులో 5 సెక్టార్ రూట్లను ఏర్పాటు చేశారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లోని 22 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున సిబ్బంది విధులు నిర్వహిస్తారని తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది, ఈవీఎంలు చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ సిబ్బందికి స్వాగతం

రామగుండం: సోమనపల్లి పోలింగ్ సిబ్బంది కేంద్రానికి ఆదివారం చేరుకున్న సిబ్బందికి ఎంపీడీవో ఎం.ఎ.అలీం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం, మద్రిపల్లి, బ్రాహ్మణపల్లి, సోమనపల్లి, ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్ తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బూత్ లెవల్ ఆఫీసర్స్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం అధికారులు పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యంతో పాటు ఓటర్లు ఎండలో ఉండకుండా టెంట్లు వేయించారు. గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. పరిశీలించిన వారిలో తహసీల్దార్ ఆరిఫొద్దిన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సూదాటి కోటేశ్వరరావు, ఆర్ఐ సంధాని, పంచాయతీ కార్యదర్శి మారుతి సిబ్బంది ఉన్నారు.

విధులకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో అధికారులు 41 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల సిబ్బంది సామగ్రితో సహా చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కాల్వశ్రీరాంపూర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

ఓదెలలో పోలింగ్‌కు సిద్ధం

ఓదెల: మండలంలో పోలింగు కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. సోమవారం జరిగే ఎన్నికలకు మండలంలోని అన్ని పోలింగు కేంద్రాలకు పోలీసుల బందోబస్తుతో సిబ్బంది చేరుకున్నారు. ఉదయం ప్రారంభమయ్యే పోలింగ్ కోసం ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సుల్తానాబాద్: పట్టణంతోపాటు అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రశాంతంగా ఈవీఎంలను చేరవేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి సిబ్బంది పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని సరి చూసుకోవడంతో పాటు ఉదయం మాక్ పోలింగ్ 5:30 నిమిషాలకు ఏజెంట్ల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 62 పోలింగ్ కేంద్రాలు ఉండగా 62 ఎన్నికల అధికారులతోపాటు 340 మంది సిబ్బంది విధులకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 8 సెక్టార్లను విభజించి పంపించినట్లు తెలిపారు. ఈవీఎంలు ఇబ్బందులైన ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసేందుకు ప్రతీ కేంద్రానికి రెండు అదనపు ఈవీఎంలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. 54,895 మంది ఓటర్లు ఉన్నారు. సుల్తానాబాద్ పోలింగ్ కేంద్రాన్ని సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యూత్ మోడల్ పోలింగ్ కేంద్రంగా బసంత్‌నగర్



స్వాగతం పలుకుతున్న మండల అధికారులు

పాలకుర్తి: పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో ఎంపీ ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలవ్యాప్తంగా మొత్తం 38 పోలింగ్ కేంద్రాలలో 55బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో రామగుండం నియోజకవర్గంలో 29, మంథని నియోజకవర్గంలో 9 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున సిబ్బందిని కేటాయించారు. కాగా సదరు అధికారులు కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సంబంధించిన పోలీసులు ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నారు.

జిల్లా మోడల్ యూత్ పోలింగ్ స్టేషన్..

బసంత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పెద్దపల్లి జిల్లా మోడల్ యూత్ పోలింగ్ కేంద్రంగా అధికారులు గుర్తించారు. అత్యధికంగా 37శాతం యువ ఓటర్లు ఉన్న నేపథ్యంలో సంబంధిత పోలింగ్ కేంద్రాన్ని యూత్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసి మామిడి తోరణాలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. ఎంపీడీవో శశికళ, మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా, పంచాయతీ కార్యదర్శి నరేశ్ సంబంధిత కేంద్రంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన పోలింగ్ సిబ్బందికి స్వాగతం పలికారు.

ఆదిశంకరాచార్యుల జయంతి




పూజలు చేస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జగద్గురువు ఆదిశంకరాచార్యులు జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు కర్నే అశోక్‌శర్మ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దూప దీప నైవేద్యాలు సమర్పించారు.

ప్రభావిత గ్రామాలను కమ్మేసిన బూడిద

- ఈదురుగాలులకు కప్పేస్తున్న వైనం
- దృష్టిసారించని ఎన్టీపీసీ యాజమాన్యం
- ప్రతి ఏటా మే వచ్చిందంటే గ్రామస్తులకు తప్పని తిప్పలు



ఈదురుగాలులకు కాలనీలను కమ్మేసిన బూడిద

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేకాలనీవాసులు ఆదివారం వీచిన భారీ ఈదురుగాలులతో అక్బర్‌నగర్ సమీపంలోని ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి భారీ ఎత్తున బూడిద గాలిలో కలిసి గ్రామాలను కప్పేసింది. అరగంట పాటు ఏకధాటిగా వీచిన ఈదురుగాలులతో కుందనపల్లి, అక్బర్‌నగర్ కాలనీవాసులు బూడిద తీవ్రతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఓ దశలో ఎన్టీపీసీ బూడిద తీవ్రతతో కొంత సమయం రైల్వే సిగ్నలింగ్ లైట్స్ సైతం కనిపించకుండా పోయాయి. అరగంట తర్వాత ఈదురుగాలులు తగ్గుముఖం పట్టిన తర్వాత ఇళ్లంతా బూడిదతో నిండిపోయాయి. వంట గదుల్లోని భోజన పాత్రలపై బూడిద కప్పేయడంతో బయట పడేశామని పలువురు వాపోయారు.

మే వచ్చిందంటే తప్పని తిప్పలు..

ప్రతీ ఏటా మే, జూన్ రెండో వారం వరకు తరచూ వీచే ఈదురుగాలులతో అక్బర్‌నగర్ సమీపంలోని ఎన్టీపీసీ బూడిద చెరువు నుంచి భారీ ఎత్తున బూడిద లేచి గ్రామాలను కప్పేస్తుండడం సమస్యగా మారింది. కాగా ఈ సమస్యను ముందే గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ ఎన్టీపీసీ యాజమాన్యం కనీసం బూడిద చెరువులో వందలాది స్ప్రింక్లింగ్ మిషన్ల సాయంతో కొంతమేర ఈదురుగాలులకు వీచే బూడిదను అదుపు చేయాలి. కానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అప్పటికప్పుడు బాధిత గ్రామాల ప్రజలు ఎన్టీపీసీ బూడిద చెరువు పెట్రోలింగ్‌కు వచ్చే అధికారులను నిలదీసిన ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఇలాంటి సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తుంటారు.

సమస్య పరిష్కారంలో విఫలం



ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి మూడునెలల వేసవి కాలం పూర్తయి వర్షాలు ప్రారంభమయ్యేంత వరకు ప్రతీరోజు వందలాది టన్నుల బూడిద వివిధ అవసరాలకు ట్రాన్స్‌పోర్టింగ్ జరుగుతుంది. యాజమాన్యం కేవలం బూడిద వ్యాపారంపైనే దృష్టి సారిస్తుండగా ప్రభావిత గ్రామాల సంక్షేమాన్ని మాత్రం గాలికొదిలేసింది. బూడిద రవాణాపై ఎప్పటికప్పుడు ఎలాంటి అడ్డంకులు ఎదురుకాకుండా వ్యవహరించే ఎన్టీపీసీ యాజమాన్యం.. గ్రామాలను బూడిద కప్పేయడంతో ఎదురయ్యే సమస్యలను మాత్రం పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది.

– కొండల రాజేందర్‌కుమార్, అక్బర్‌నగర్‌వాసి

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ రోడ్‌షో కార్యక్రమానికి వచ్చి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం మండలం గోపాల్‌రావుపేటకు చెందిన జంగిలి బక్కయ్య మరణించారు. కాగా అతడి కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సమస్యలు, ఇతర సమస్యలు రాకుండా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్య రూప్లానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ ఎంపీటీసీ చింతల జగన్మోహన్‌రెడ్డి, లింగయ్య, నాయకులు రాజయ్య, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌ను సరిచేయండి సారూ



పక్కకు పడి ఉన్న ప్రధాన స్ట్రీట్ లైట్ స్తంభం

రామగుండం: రామగుండం నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభం కొన్నినెలల క్రితం పక్కకు ఒరిగింది. ఫలితంగా ఆ ప్రాంతంలో రాత్రివేళల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. దీనిపై సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి సత్వరమే పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించి స్ట్రీట్ లైట్‌ను వెలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

25 ఇళ్లకు ఒకే బోర్



25 కనెక్షన్లు ఉన్న బోర్

జ్యోతినగర్: వేసవిలో నీటి గోసలు అందరికీ వస్తుంటాయి. కానీ పేదల కాలనీలో నీటి కష్టాలను తీర్చేందుకు ఓ బోర్ పేదల కాలనీలోని 25 ఇళ్లకు నీటిని అందిస్తోంది. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని సిక్కువాడలో ఎన్టీపీసీ సంస్థ నీటికోసం ఏర్పాటు చేసిన బోర్‌కు 25 నివాస గృహాల వారు కనెక్షన్లు తీసుకుని విడతల వారికి నీటిని వినియోగించుకుంటున్నారు.



ప్రజలను బెంబేలెత్తిస్తున్న వానర సైన్యం

రామగుండం: రాత్రి, పగలు అనే తేడా లేకుండా వానర సైన్యం చేసే అలజడితో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రైల్వేకాలనీలో అర్ధరాత్రి ఓ కార్యాలయంపై వందలాది వానర సైన్యం సేద తీరుతున్నాయి. వేసవి సీజన్‌లో ఇంట్లో ఉక్కపోతను భరించలేక రాత్రివేళల్లో డాబాపై పడుకుందామంటే వానర సైన్యంతో బయట అడుగు పెట్టలేని దుస్థితి నెలకొంది. క్రమంగా రామగుండం రైల్వేస్టేషన్, కాలనీలలో వానరుల సంతతి గణనీయంగా పెరిగిపోయింది. ఇంటి పరిసరాల్లో నాటే కూరగాయల మొక్కలు, పండ్లు, పూలమొక్కలు, అందాన్నిచ్చే పూల కుండీలను సైతం ధ్వంసం చేస్తున్నాయి. దీంతో చాలామంది ఇంటి చుట్టూ కోతుల బెడదను అధిగమించేందుకు ఇనుప గ్రిల్స్ బిగించుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా చిన్నారులను బయటకు పంపించాలన్నా, స్కూల్‌కు వెళ్లాలన్నా వారితో పెద్దవారు తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వానర సైన్యం సంతతికి బ్రేక్ వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఐదు డివిజన్లు, 17వేల ఓటర్లు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15, 16, 17, 18, 19వ డివిజన్లలో దాదాపు 17వేల ఓటర్లు సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. 7 కేంద్రాల్లో 25 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాల (జెడ్పీహెచ్), సింగరేణి పాఠశాల, అల్లూరు ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీ పాలకుర్తి సంతోష్‌నగర్, శాంతినికేతన్, బచ్‌పన్ స్కూల్, స్పందన పాఠశాలలో 25 బూత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మోడల్ పోలింగ్ స్టేషన్‌కు అలంకరణ



బెలూన్లతో అలంకరించిన సింగరేణి టీటీసీ

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో మోడల్‌పోలింగ్ స్టేషన్‌గా 145 పోలింగ్ సెంటర్ ఎంపిక చేశారు. సింగరేణి టెక్నికల్ ట్రెయినింగ్ సెంటర్‌లో పోలింగ్ సెంటర్ ఏర్పాటు చేయగా, బెలూన్లతో అందంగా తీర్చిదిద్దారు. వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు ప్రకృతి బద్ధంగా రంజన్లు, చిన్న మొక్కలు ఏర్పాటు చేశారు.